క్లుప్తంగా

సేవాభావం అలవర్చుకోండి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

పెనుకొండ: యువత సేవాభావాన్ని అలవర్చుకోవాలని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. 1969లో కళాశాల స్థాయిలో జాతీయ సేవాపథకాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. భారత ప్రభుత్వ యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పని చేసే ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందన్నారు. సమావేశంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రూ.5 లక్షలతో వాష్ రూముల నిర్మాణం



వాష్ రూములను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

లేపాక్షి: లేపాక్షి అన్నదాన ప్రసాదం సేవా ట్రస్ట్ ఆవరణలో రూ.5 లక్షల మండల పరిషత్ నిధులతో నూతనంగా నిర్మించిన వాష్ రూములను శనివారం ఉదయం గ్రామ సర్పంచ్ ఆదినారాయణ, జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, మండల కన్వీనర్ నారాయణస్వామి ప్రారంభించారు. దాతల సహకారంతో నిర్మించిన అన్నదాన సత్రం సమీపంలో వాష్ రూముల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ప్రజాప్రతినిధులకు జేఏసీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చలపతి, నరసప్ప, నిస్సార్, జేఏసీ సభ్యులు రామప్రసాద్, సుబ్రహ్మణ్యం, ఈరన్న, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



అంగన్‌వాడీ కార్యకర్తతో మాట్లాడుతున్న ఎంపీపీ ఈరన్న

అమరాపురం: మద్దనకుంట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీపీ ఈరన్న శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో ఎంత మంది పిల్లలు ఉన్నారు? రోజు కేంద్రానికి వస్తున్నారా? అలాగే ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా అందిస్తున్నారా అని ఆరా తీశారు. హాజరు పట్టికను పరిశీలించారు. గర్భిణులు, బాలింతల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహారం ఇంటి వద్దకే అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని సూచించారు. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. జగనన్న గోరుముద్ద పథకం ద్వారా రుచికరమైన ఆహారం అందించాలని సూచించారు. ఎంపీటీసీ హనుమంతరాయ పాల్గొన్నారు.


వర్షానికి కూలిన ఇల్లు



కూలిన ఇంటిని చూపుతున్న నాగరాజు కుటుంబ సభ్యులు

రొద్దం: మండల పరిధిలోని పెద్దకోడిపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి బోయ నాగరాజుకు చెందిన ఇల్లు వర్షానికి కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లోని కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. ప్రభుత్వం స్పందించి ఇల్లు మంజూరు చేయాలని నాగరాజు కోరాడు.

33.6 మి.మీ వర్షపాతం నమోదు



మడకశిరలో కురుస్తున్న వర్షం

చిలమత్తూరు: మండలంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. 10 గంటలకు ప్రారంభమైన వర్షం సుమారు గంట పాటు కురిసింది. మండల వ్యాప్తంగా 33.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌ఓ భార్గవి తెలిపారు.

మడకశిరరూరల్: మండలంలో శనివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేసిన ఉలవ సాగుకు పదును లభించింది.

వెళ్లిరా.. వినాయకా



అమరాపురం: విశేష పూజలందుకున్న బొజ్జ గణపతి

హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో శనివారం గణపయ్యలను గంగ ఒడికి చేర్చారు. హిందూపురం పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లి, సింగిరెడ్డిపల్లి ప్రాంతాల్లో వినాయక నిమజ్జనం వేడుకగా సాగింది. ఐదు రోజుల పాటు పూజలు నిర్వహించిన అనంతరం విగ్రహాలను ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో కొలువుదీర్చి, ఊరేగించారు. డీజే మ్యూజిక్, డ్రమ్స్, సంగీత వాయిద్యాలతో ముద్దిరెడ్డిపల్లి వీధులు మార్మోగాయి. యువత రంగులు చల్లుకుంటూ డ్యాన్స్‌లతో అలరించారు. ఈ ప్రాంతంలో కొలువుదీర్చిన సుమారు 50కి పైగా విగ్రహాలను నిమజ్జనం చేశారు. లేపాక్షిలో వినాయకుల నిమజ్జనం కోలాహలంగా సాగింది. వినాయకులను వివిధ వాహనాల్లో కొలువుదీర్చి, నంది విగ్రహం, మెయిన్ బజార్ మీదుగా ఊరేగించారు. అనంతరం స్థానిక పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. పావగడలోని బ్రైస్ గేజ్ ఎక్స్‌టెన్షన్‌లో కొలువుదీర్చిన వినాయకుడిని భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. అమరాపురంలో వినాయక నగర్, పాత పోలీస్ స్టేషన్‌లో ప్రతిష్ఠించిన గణపయ్యలకు అర్చకులు, కమిటీ సభ్యులు, భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. పరిగి మండల కేంద్రంలోని 90 ఇండ్ల ఎస్సీ కాలనీలో వినాయక నిమజ్జన ఘనంగా జరిగింది. తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, సర్పంచ్ లక్ష్మీదేవి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. హిందూపురంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నదానం చేశారు. – సాక్షినెట్‌వర్క్:



కొటిపిలో పూజలు చేస్తున్న పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టిఎన్.దీపిక



హిందూపురం పట్టణం ముద్దిరెడ్డిపల్లి రహదారిలో..







హిందూపురం: గడిగ గణేశ మండపం వద్ద ముస్లింలు, పరిగిలో వినాయకుడికి పూజలు



అమరాపురంలో..



లేపాక్షి: కూరాకు పేటలో..

హిందూపురం: గణపతి ఊరేగింపు



హిందూపురం: ముద్దిరెడ్డిపల్లిలో యువతుల నృత్యం



పావగడ: ఊరేగింపులో యువతుల సందడి



లేపాక్షి: ఎస్సీ కాలనీలో ఊరేగుతున్న గణపయ్య

పక్కాగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే



రొళ్ల: మల్లినమడుగులో సర్వే చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



అమరాపురం: మాట్లాడుతున్న జేసీఎస్ మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి

అమరాపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పక్కాగా చేపట్టాలని జేసీఎస్ మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క కోరారు. శనివారం మధ్యాహ్నం ఆలదపల్లి సచివాలయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఏఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. వలంటీర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు, అంగన్‌వాడీలు ఇంటింటికీ వెళ్లి స్పష్టమైన పక్కా సమాచారాన్ని సేకరించాలన్నారు. కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలను తెలుసుకోవాలన్నారు. అనారోగ్య సమస్యలను ఆరోగ్యశాఖకు పంపిస్తే మందులను ప్రభుత్వం ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

'ఆరోగ్యమే మహాభాగ్యం'

రొళ్ల: మండలంలోని బీజీ హళ్లి, మల్లినమడుగు, ఎం.రాయాపురం, గుడ్డగుర్కి సచివాలయం పరిధిలోని వివిధ గ్రామాల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, వలంటీర్లు సంయుక్తంగా ఇంటింటా సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా పీహెచ్‌ఎన్ సుధారాణి మాట్లాడుతూ.. గ్రామీణుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించించడం జరిగిందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సర్వేకు సహకరించాలన్నారు. సర్వేలో ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం సచివాలయలో వైద్య శిబిరం నిర్వహించారు. సర్వేలో గుర్తించిన రోగులకు చికిత్సలు అందిస్తామన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మి, భాగ్యజ్యోతి, చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పీలు జ్యోతి, ఈశ్వరి, జయంతి, ఎంపీహెచ్‌ఏలు గాయత్రి, రాధాకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, పద్మావతి, సరస్వతి, వాసుదేవరెడ్డి, ఆశావర్కర్లు, వలంటీర్లు, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

29న మహాధర్నా



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 29న విజయవాడలో చేపట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని కేవీపీఎస్ నాయకులు కోరారు. శనివారం స్థానిక ఇందిరా పార్కులో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో దళితులపై దాడులు, సీఆర్‌పీసీ 41ను రద్దు చేయాలని కోరారు. డప్పు కళాకారులకు, చర్మ కళాకారులకు రూ.5 వేల పింఛన్ ఇవ్వాలని తదితర డిమాండ్లతో ధర్నా చేపట్టామన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు రమణ, మధు, వెంకటేశ్వర్లు, కృష్ణ పాల్గొన్నారు.

సోమందేపల్లి: కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 29న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమయ్య విడుదల చేశారు. కేవీపీఎస్ నాయకులు గోవిందప్ప, సూర్యనారాయణ, రంగప్ప, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ–2 శ్రీధర్

రొళ్ల: ప్రభుత్వం పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 'జగనన్న గోరు ముద్ద' పథకం ద్వారా రుచికరమైన భోజనం వడ్డించాలని ఎంఈఓ–2 శ్రీధర్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పిల్లల సంపూర్ణ ఆరోగ్యం దృష్ట్యా ఉదయం పూట రాగి జావా, మధ్యాహ్నం పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రోజూ మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనాన్ని పిల్లలకు వడ్డించాలని సూచించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై విద్యను అభ్యసించాలన్నారు. ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎండీఎం నిర్వాహకుడు నగేష్ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు ఊరట



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

పెనుకొండ/గోరంట్ల/పరిగి: ముఖ్యమంత్రి సహాయనిధితో పేద కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పెనుకొండ, రొద్దం, గోరంట్ల మండలాలకు చెందిన పలువురికి రూ.4 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రొద్దం, గోరంట్ల, పరిగి మండలాలకు చెందిన సాయిరాకేష్, అంజినప్ప, రామాంజినప్ప, చంద్రశేఖర్ నాయక్ రోడ్డు ప్రమాదం, ఇతర కారణాలతో మరణించినట్లు తెలిపారు. కుటుంబాలను ఆదుకుంటామని గతంలో హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. అందులో భాగంగా సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.4 లక్షలను బాధిత కుటుంబాలకు అందజేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం అందించిన సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమకు సహాయం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే శంకరనారాయణకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కరావుపల్లి తండా సర్పంచ్ రమాదేవి, ఎంపీటీసీ నాగేనాయక్, పుట్టగుండ్లపల్లి సర్పంచ్ నార్పిరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలసిన విద్యుత్‌శాఖ డీఈఈ

పెనుకొండ: పెనుకొండ విద్యుత్ శాఖ డీఈఈ శేషగిరిబాబు శనివారం ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం విద్యుత్ శాఖకు సంబంధించిన విషయాలపై చర్చించారు.

చిన్నారుల దాతృత్వం



హుండీలో దాచుకున్న డబ్బు అందిస్తున్న విద్యార్థులు

గుడిబండ: అనారోగ్యంతో బాధపడుతున్న మిత్రుడి వైద్య ఖర్చులకు హుండీలో దాచుకున్న డబ్బులు అందజేసి గొప్ప మనస్సు చాటుకున్నారు. ఇద్దరు విద్యార్థులు. వివరాలు.. మండల పరిధిలోని కే.ఎస్.పల్లికి చెందిన తిమ్మరాయప్ప, దీపారాణిల కుమారుడు మనోహర్ స్థానిక రవీంద్రా విద్యానికేతన్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. మనోహర్ మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతూ బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో నెల రోజుల నుంచి చికిత్స పొందుతున్నాడు. కోలుకోవడానికి 4 నెలలు పడుతుందని డాక్టర్లు వెల్లడించారు. చికిత్సకు ఎక్కువ డబ్బులు ఖర్చు అవుతుందని తెలిపారు. విషయం తెలుసుకున్న కె.ఎస్.పల్లి గ్రామానికి చెందిన కృష్ణకాంత్, అమ్మాజి దంపతుల కుమారులు ముకుందరాజ్, యోగసాయి తమ మిత్రుడి వైద్య చికిత్స కోసం హుండీలో దాచుకున్న రూ.2,468 అందజేశారు. ఈ మొత్తాన్ని శనివారం రవీంద్రా విద్యానికేతన్ పాఠశాల చైర్మన్ రాజుకు అందించారు. హుండీలో దాచుకున్న డబ్బు అందజేసిన విద్యార్థులను రవీంద్రా విద్యానికేతన్ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఐటీ రంగంలో రాణించాలి



మాట్లాడుతున్న డీవీఈఓ రఘునాథరెడ్డి

పెనుకొండ: ఇంటర్ అనంతరం ఐటీ రంగంలోకి రావాలనుకున్న యువతకు హెచ్‌ఎల్‌సీ కంపెనీ అండగా ఉంటుందని కంపెనీ ప్రతినిధులు సాయికిరణ్, కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో శనివారం పలు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటర్ పూర్తయిన వారికి హెచ్‌ఎల్‌సీ కంపెనీ నుంచి టెక్బీ అనే ప్రోగ్రాం ఉందన్నారు. ఇంటర్ మ్యాథ్స్‌లో 60 శాతం, మిగిలిన సబ్జెక్టుల్లో 75 శాతం మార్కులు వచ్చి ఉండాలన్నారు. మ్యాథమ్యాటిక్స్ గ్రూపు ఉన్న వారికి ఐటీ రోల్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. 2023లో ఇంటర్ పాసయ్యే విద్యార్థులకు ఈ విధానం వర్తిస్తుందన్నారు. 2024లో ఇంటర్ పాసయ్యే వారికి అక్టోబర్ నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీవీఈఓ రఘునాథరెడ్డి వెల్లడించారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఐటీ రంగంలో రాణించాలన్నారు. సమావేశంలో ఆర్ఐఓ షఫీ, ప్రిన్సిపల్ బషీర్ అహ్మద్ సత్యసాయి జిల్లా ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

లేపాక్షి: హిందూపురం డిపో నుంచి ప్రతి నెల పౌర్ణమిని పురస్కరించుకుని అరుణాచలం గిరి ప్రదక్షణకు సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ హంపన్న, లేపాక్షి ఆర్టీసీ కంట్రోలర్ బాషా శనివారం తెలిపారు. ఈనెల 28న సాయంత్రం 5 గంటలకు హిందూపురంలో బస్సు బయలుదేరి, 29 ఉదయం 3 గంటలకు అరుణాచలం చేరుతుందన్నారు. గిరి ప్రదక్షణ అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరుతుందని పేర్కొన్నారు. శ్రీపురం, గోల్డెన్ టెంపుల్‌ను దర్శించుకుని మరుసటి రోజు 4 గంటలకు హిందూపురం చేరుతుందన్నారు. టికెట్టు ధర రూ.1,320 (రిజర్వేషన్‌తో కలిపి) నిర్ణయించినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 7382861308, 8977225997 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకుందాం



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక

హిందూపురం: వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకుందామని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక అన్నారు. శనివారం గుడ్డం కోనేరు వద్ద జరుగుతున్న నిమజ్జన ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, కమిషనర్ ప్రమోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. ఆదివారం జరిగే వినాయక నిమజ్జనానికి అన్ని వసతులు కల్పించాలన్నారు. ముఖ్యంగా కోనేరు చుట్టూ గట్టిభద్రతతో పాటు లైటింగ్ సదుపాయం కల్పించాలన్నారు. పోలీసులు కూడా గట్టి బందోబస్తు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలో శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో ప్రధాన వీధుల్లో ర్యాలీ చేపట్టారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరూ పట్టణంలో స్వచ్ఛతను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, కమిషనర్ ప్రభాకరరావు, కౌన్సిలర్లు, మున్సిపల్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యను ప్రోత్సహించాలి



ఆర్థికసాయం అందజేస్తున్న చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం: బాలికా విద్యను ప్రోత్సహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, ఇన్నర్‌వీల్‌క్లబ్ డిస్ట్రిక్ 316 చైర్మన్ సుమిత్ర అన్నారు. శనివారం రాత్రి స్థానిక ఇన్నర్‌విల్ క్లబ్‌లో పదో తరగతి బాలికలకు ఆర్థికసాయం పంపిణీ చేశారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న బాలికలకు క్లబ్ ద్వారా ఆర్థిక సహకారం అందించడం జరుగుతుందన్నారు. వివిధ చైతన్య, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతామన్నారు. పదో తరగతి చదువుతున్న పేద విద్యార్థినులకు రూ.10 వేల చొప్పున ఆర్థికసహాయం అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షులు భువనేశ్వరీ, కార్యదర్శి శ్రీలక్ష్మి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞానంపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయమూర్తి శైలజ

పరిగి: న్యాయ విజ్ఞానంపై అందరికీ అవగాహన కలిగి ఉండాలని శ్రీసత్యసాయి జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శైలజ, జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞన సదస్సు జరిగింది. విద్యార్థి దశ నుంచే న్యాయం, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు, న్యాయవాదులు శ్రీనివాసరెడ్డి, సుదర్శన్, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పౌర కార్మికుల సేవలు అభినందనీయం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: పరిసరాల పరిశుభ్రతలో స్థానిక మున్సిపల్ శాఖ పౌర కార్మికుల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ కొనియాడారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పౌర కార్మికుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్మికులు తమ ఆరోగ్యాలను సైతం లెక్క చేయకుండా పట్టణ ప్రజల ఆరోగ్యం కోసం పాటుపడటం హర్షణీయమన్నారు. పౌర కార్మికులకు చేతులెత్తి నమస్కరిస్తున్నా అంటూ అభివాదం చేశారు. ఉదయం 5 గంటలకే లేచి పట్టణమంతా శుభ్రం చేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న కార్మికులకు ప్రతి ఒక్కరూ రుణపడి ఉంటామన్నారు. అయితే పౌర కార్మికులు తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. తమ పిల్లలను బాగా చదివించి బంగారు భవిష్యత్తును అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పౌర కార్మికుల 17 ఇళ్లను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. వాటర్ మెన్, వాహన డ్రైవర్ల తాత్కాలిక ఉద్యోగాల రెగ్యులరైజేషన్, స్వీపర్ల సంఖ్యను పెంచేందుకు సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం పౌర కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అన్ని వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ ముఖ్యాధికారి షంషు, కాంగ్రెస్ నాయకులు ఏ శంకరరెడ్డి, పీహెచ్ రాజేశ్, బత్తినేని నాని తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్‌కు తుది గడువు 30

మడకశిరరూరల్: మడకశిర వ్యవసాయశాఖ డివిజన్‌లో ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటలను ఈనెల 30వ తేదీలోపు ఈ–క్రాప్ బుకింగ్ చేయాలని ఏడీఏ కృష్ణమీనన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే డివిజన్ పరిధిలో 85 శాతం ఈ–క్రాప్ బుకింగ్ నమోదు పూర్తయినట్లు పేర్కొన్నారు. పంటలు సాగు చేసిన రైతులు ఈ–క్రాప్ బుకింగ్ నమోదు చేయించుకోవాలన్నారు. ఈ–క్రాప్ బుకింగ్‌తోనే ప్రభుత్వం అమలు చేసిన రాయితీ పథకాలు వర్తిస్తాయన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి

సోమందేపల్లి: మండలంలోని చాకర్లపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి దళితులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘం నాయకులు వెంకటేశులు, రామకృష్ణ, సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఎస్సీ కాలనీలోని ఆర్డీటీ కార్యాలయం వద్ద దళితులకు సంబంధించిన ఆస్తులను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని స్థానికులు ఆరోపించారు. కాగా వినాయక నిమజ్జనం నాడు గ్రామంలో రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో తమపై ఉన్నత వర్గాల వారు దాడులకు పాల్పడ్డారని ఎస్సీ కాలనీ వాసులు చెబుతున్నారు. ఘటనపై ఎస్ఐ విజయ్ కుమార్ విచారణ చేపట్టారు.